



ఆ ఐరిస్ స్కానర్లు వెనక్కొస్తాయా?

ఎండీయూ ఆపరేటర్లను వెతికే పనిలో అధికారులు

● ఇవ్వకుంటే స్కానర్‌కు రూ.6400వంతున వసూలు చేసే ప్రయత్నం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ సరుకుల పంపిణీ కోసం ఎండీయూ ఆపరేటర్లకు సరఫరా చేసిన ఐరిస్ స్కానర్లను వెనక్కు తీసుకోవడం అధికారులకు తలనొప్పిగా తయారైంది.రేషన్ డీలర్ల స్థానంలో ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి రేషన్ సరుకులను అప్పట్లో పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థ స్థానంలో రేషన్ డీలర్ల ద్వారా సరుకుల పంపిణీ చేపడుతున్న విషయం తెలిసిందే.వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 1379 చౌకదుకాణాలకు 336 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసి ఐరిస్ స్కానర్లను అందించారు. వాటిని వెనక్కివ్వాలని పౌరసరఫరాల శాఖ అధికారులు ఎండీయూ ఆపరేటర్లను కోరినా ఇప్పటివరకు 275 స్కానర్లు మాత్రమే అధికారులకు చేరాయి. మిగిలిన 61 ఏమయ్యాయో తెలియడం లేదు. వెనక్కురాని స్కానర్లను ఈ నెలాఖరులోగా తెప్పించాలంటూ పౌరసరఫరాల శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు రావడంతో అధికారులు ఎండీయూ ఆపరేటర్లను వెతికే పనిలో పడ్డారు. కొందరు ఆపరేటర్లు బాధ్యత లేకుండా వాటిని మూలపడేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వెనక్కివ్వకుంటే ఒక్కో ఐరిస్ స్కానర్‌కు రూ.6400వంతున వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. చాలామంది ఆపరేటర్లు తాము స్కానర్లను డీలర్లకు ఇచ్చేశామని చెబుతున్నారు. కొంతమంది వీఆర్వోలకు ఇచ్చేశామంటున్నారు.అయితే బాధ్యత ఎండీయూ ఆపరేటర్లదే కాబట్టి డబ్బులు అతడే కట్టాల్సి వుంది. గతంలో ఎండీయూ ఆపరేటర్లకు వాహనానికి పదిశాతం లబ్ధిదారుడి వాటాతో వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలను మంజూరు చేశారు. నాలుగున్నరేళ్లగా ఈఎంఐలు చెల్లించిన ఆపరేటర్లు మిగిలిన మొత్తాన్ని ఆయా కార్పొరేషన్ల ద్వారా బ్యాంకులకు చెల్లించి వాహనానికి క్లియరెన్స్ పొందాల్సి వుంది.దీంతో వాహనాలకు బ్యాలెన్స్ ఈఎంఐలు కట్టించుకునేటప్పుడే ఐరిస్ స్కానర్లు వెనక్కివ్వని ఎండీయూ ఆపరేటర్లనుంచి రూ.6400వంతున వసూలు చేయాలని బ్యాంకర్లకు డీఎస్వో లేఖలు రాశారు.మరి ఈ ప్రయత్నం ఎంతవరకూ ఫలిస్తుందో వేచిచూడాల్సి వుంది.

విద్యార్థులకు రవాణా భత్యం రూ.1.66 కోట్ల విడుదల

చిత్తూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రవాణా భత్యం కింద రూ.1.66 కోట్లు మంజూరు చేసినట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో అర్హత గల విద్యార్థులకు రవాణా భత్యం సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ. 6 వేల చొప్పున వారి తల్లుల ఖాతాల్లో జమచేశామన్నారు. మొదటి విడతగా 5,553 మంది విద్యార్థులకు నెలకు రూ.3 వేల చొప్పున రూ.1,66,59,000 తల్లుల ఖాతాలో జమచేసినట్లు వివరించారు.



నేడు రాష్ట్రపతి రాక

7

భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ స్వాగతం పలకనున్న మంత్రులు

తిరుచానూరు పద్మావతీ దేవిని దర్శించుకోనున్న ద్రౌపదిముర్ము

రేపు ఉదయం తిరుమల శ్రీవారి దర్శనం



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న భువనేశ్వరి

ప్రతికూలతను ఎదుర్కొంటేనే విజయం

● విద్యార్థులతో ముఖాముఖిలో భువనేశ్వరి



కుప్పం/గుడుపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు ఎదురొడ్డి నిలడితేనే విజయం సొంతమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి విద్యార్థులకు సూచించారు.కుప్పం నియోజకవర్గ పర్యటనలో తొలి రోజైన బుధవారంనాడు ఆమె ద్రావిడ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. కొద్దిసేపు విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన అనంతరం వారినుంచి ప్రశ్నలను ఆహ్వానించారు. పలువురు విద్యార్థులు దీనిపై ఉత్సాహంగా స్పందించి, ఆమెపై ప్రశ్నలను సంధించారు. ప్రశ్నలన్నింటికీ భువనేశ్వరి ఓపిగ్గా, దీటుగా సమాధానం ఇచ్చారు. సీఎం చంద్రబాబులో మీకు నచ్చిన నాయకత్వ లక్షణం ఏమిటని విద్యార్థులు ప్రశ్నించారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు సహనం కోల్పోకుండా, సమస్యను చక్కగా విశ్లేషించుకుని కార్యాచరణకు పూనుకునే లక్షణం తనకు ఎంతో ఇష్టమన్నారు. అలాగే అవకాశం వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలని, సేవారంగమే సామాజిక రంగానికి బాటలు వేస్తుందని మరో విద్యార్థి అడిగిన ప్రశ్నకు స్పందించారు. ఫలితం ఆశించకుండా సామాజిక సేవ చేయాలన్నారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వం, సమయపాలన వంటి ఉత్తమ లక్షణాలు కలిగిన నందమూరి తారకరామారావు, నారా చంద్రబాబు నాయుడు నుంచి తాను ఎంతో ప్రేరణ పొందానని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.ఒకరికొకరు సహకరించుకోవడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుంద న్నారు. విద్యార్థులు మొదట చదువుపైన దృష్టిపెట్టి కర్తవ్యం నిర్వహించాలని, అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఉద్బోధించారు. పురుషులలో లేని, సహజమైన సహనశక్తి స్త్రీలకు సహజంగానే సంక్రమిస్తుందన్న భువనేశ్వరి, అందువల్లనే స్త్రీలు అన్ని పనులనూ సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం కలిగి ఉంటారని పేర్కొన్నారు. చంద్రబాబు మిన్నువిరిగి మీదపడ్డా చలించరని, ప్రతికూల పరిస్థితులను సైతం తనకు అనుకూలంగా మలచుకోవడంలో ఆయన చూపించే చొరవ తనకు బాగా నచ్చిన లక్షణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్. మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్,పీకేఎం ఉడా చైర్మన్ సురేశ్‌బాబు, ద్రావిడ వర్శిటీ వీసీ దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, అకడమిక్ డీన్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మల్లప్పకొండపై కార్తీక దీపారాధన

గుడుపల్లె మండలం మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం జరిగిన దీపారాధనలో భువనేశ్వరి పాల్గొన్నారు. కార్తీక దీపాలు వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.





● బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం కల్పవృక్ష వాహనం

మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం

సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ

రాత్రి హనుమంత వాహనం

మృగరాజుపై యోగనరసింహుడిగా..

● భక్తులను కటాక్షించిన పద్మావతి

తిరుచానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరచానూరులోని పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన బుధవారం ఉదయం ముత్యపుపందిరిపై అమ్మవారు శ్రీధనలక్ష్మి రూపంలో భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, వేద, ప్రబంధ పారాయణం, భజన బృందాల ప్రదర్శనలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ తిరువీధుల్లో ముత్యపుపందిరి వాహనం ముందుకు సాగింది. మధ్యాహ్నం శ్రీకృష్ణ ముఖమండపంలో ఉత్సవమూర్తికి నేత్రానందంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి సింహవాహనంపై యోగనరసింహుడి రూపంలో అమ్మవారు తిరుమాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. కళాబృందాల సాంస్కృతిక నీరాజనంతో అమ్మవారి సింహవాహన సేవ అత్యంత రమణీయంగా సాగింది. ఆయా కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరీంధర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాతలకు రెట్టింపు ఆనందం

● విడుదలైన రూ.136.46 కోట్లు రెండో దఫా సాయం

● నియోజకవర్గాల్లో ఏర్పాటైన కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జీడీ నెల్లూరులో రైతులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే థామస్

చిత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రెండో దఫా నిధుల్ని అందించాయి.ఆగస్టులో తొలి విడత నిధులు అందించిన విషయం తెలిసిందే.జిల్లాలోని రైతుల బ్యాంకు ఖాతాలకు బుధవారం రూ.136.46 కోట్ల నిధులు జమయ్యాయి. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొని లబ్ధిదారులకు నమూనా చెక్కుల్ని అందించారు. కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం జరిగింది. అక్కడి సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని ఆయా నియోజకవర్గాల్లో వీక్షించారు. బుధవారం ఎక్కువమంది ఖాతాల్లో రూ.7 వేల చొప్పున నిధులు జమవ్వగా, మిగిలిన కొంతమందికి నేడో, రేపో జమ కానున్నాయి.చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ముఖ్య అతిథిగా హాజరై, కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో వ్యవసాయానికి మంచి రోజులు వచ్చినట్లు చెప్పారు. జీడీ నెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే థామస్, కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి 'రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా, అన్నదాతలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం' అన్నారు. యాదమరి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్ పథకం వర్తించని 600 మంది రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. కుప్పం మార్కెట్‌యార్డులో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, ఏఎంసీ చైర్మెన్ జీఎం రాజు తదితరులు పాల్గొన్నారు. పుత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ పాల్గొన్నారు. రొంపిచెర్లలో అధికారులతో కలిసి పుంగనూరు టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా బాబు పాల్గొన్నారు.

రామకుప్పంలో కొనసాగుతున్న జంట ఏనుగుల దాడులు | పొలంలో ఒంటరి ఏనుగు విధ్వంసం 7

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాత

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. తమిళనాడులోని వేలూరుకు చెందిన డార్లింగ్ క్లాసిక్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ మురళి వెంకటసుబ్బు తిరుమలలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకి విరాళం డీడీని అందజేశారు.

తిరుమలలో పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్



తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి డిప్యూటీస్పీకర్ రాజవేలు బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

→ రాజవేలు

విద్యాశ్రీషతీర్థ స్వామికి పెద్ద మర్యాద



టీటీడీ పెద్ద మర్యాదతో వ్యాసరాయ మఠాధిపతి విద్యాశ్రీషతీర్థ స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అర్చక బృందంతో కలిసి ఇస్తికాఫల్(పెద్ద మర్యాద) స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకిలో తీసుకెళ్లిన శఠగోపాన్ని అందుకున్న అనంతరం స్వామిజీ మంగళవాయిద్యాలతో తన శిష్యబృందంతో కలిసి ఆలయంలోకి వెళ్లారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 26 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.19 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,966

తలనీలాలు సమర్పించినవారు: 21,535



సాంస్కృతిక వైభవం





భారతదేశం అంటే విభిన్న సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు. దేశంలో ఏ మూలకు వెళ్లినా ఏదో కొత్త సంస్కృతి మనల్ని పలకరిస్తుంది. పదుల సంఖ్యలో విభిన్న సంస్కృతులు ఒకే చోట చూసేందుకు తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వేదికగా నిలుస్తున్నాయి. ఆయా వాహనాల ముందు దేశ నలుమూలల నుంచి వచ్చిన కళాబృందాల ప్రదర్శనలు భక్తుల మనసును దోచుకుంటున్నాయి. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు, ఎస్వీ మ్యూజిక్ కళాశాల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిరోజు 15 కళా బృందాలు ఉదయం, రాత్రి అమ్మవారి వాహన సేవల ముందు చేస్తున్న కళారాధన భక్తులను ఆకట్టుకుంటోంది. ఒక పూటకు సుమారు 500మంది కళాకారులు వాహన సేవలో పాల్గొంటారు. ఏపీ నుంచి కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, మహారాష్ట్ర నుంచి పాండురంగ నృత్యం, కేరళ నుంచి డ్రమ్స్, మణిపూర్ సాంప్రదాయ నృత్యాలు అమ్మవారి వాహనసేవలో కళారాధన చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ యేడాది తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ, గిరిజన తెగలు, ఆదివాసీలు పండుగ పబ్బాల్లో చేసే గుస్సాడీ, లంబాడీ, కోయ, గోండు నృత్యాలు జానపద కళారూపాలను ప్రతిబింబిస్తున్నాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



'సివిల్స్' ఉచిత కోచింగ్‌కు
దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్ష-2026కు సంబంధించి ఉచిత కోచింగ్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులకు అత్యుత్తమ కోచింగ్, పుస్తకాలు, భోజనం, వసతి ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 120 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటికోసం ఈ నెల 26వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ఘాట్‌రోడ్డులోని లక్ష్మీనరసింహస్వామికి
ప్రత్యేకాభిషేకం



భక్తులకు అన్నప్రసాదం పెడుతున్న అదనపు ఈవో

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని అలిపిరి కాలినడకమార్గంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామికి బుధవారం ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో స్వాతి తిరు నక్షత్రం సందర్భంగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రీవారి ఆలయ పోటు పేష్కార్ మునిరత్నంను అదనపు ఈవో సన్మానించారు.

ర్యాపిడో పేరుచెప్పి బైకులో తీసుకెళ్లి

- భక్తుడిపై మందుబాబుల దాడి
- మెడలో ఉన్న గొలుసు చోరీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ర్యాపిడో.. అంటూ బైకులో ఎక్కించుకున్నాడు. దూరంగా పొదల్లోకి తీసుకెళ్లి మరికొందరు మందబాబులతో కలిసి ఆ భక్తుడిపై దాడిచేసి బంగారు గొలుసు లాక్కెళ్లారు. తిరుపతిలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి అలిపిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శ్రీకాకుళంకు చెందిన శ్రీధర్, నెల్లూరు వైఎస్‌ఆర్ కాలనీలో ఉంటున్న ఓ కుటుంబం తిరుమల శ్రీవారి దర్శనం కోసం రెండు రోజుల క్రితం తిరుమలకు వచ్చారు. అక్కడ దర్శనం చేసుకుని ఉపాధ్యాయనగర్‌లో రూము అద్దెకు తీసుకున్నారు. ఆ తర్వాత నెల్లూరుకు చెందిన భక్తులు వెళ్లిపోయారు. శ్రీధర్ మాత్రం రైల్వే స్టేషన్‌కు వెళ్ళడానికి ఉపాధ్యాయ నగర్‌లోని బస్టాపు వద్ద నిలబడి ఉన్నారు. ఇతడిని గమనించిన ఓ వ్యక్తి రాపిడో పేరుతో మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంలో ఎక్కించుకున్నాడు. కొంతదూరంలోని ముళ్లపొదల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మద్యం తాగుతున్న తన స్నేహితులతో కలిసి శ్రీధర్‌పై దాడి చేశారు. అతడి మెడలో వున్న దాదాపు నాలుగు సవర్ల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితుడి కేకలతో స్థానికులు వచ్చారు. వీరిచ్చిన సమాచారంతో అలిపిరి ఎస్‌ఐ లోకేష్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ఐదుగురు పరారయ్యారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.



సమాపనోత్సవంలో పాల్గొన్న పద్మావతి, ద్రవిడ యూనివర్సిటీల వీసీలు ఉమ, దొరస్వామి తదితరులు

- సామాన్య ప్రజల చెంతకు

పుస్తక విజ్ఞానాన్ని చేర్చాలి

లైబ్రరీ సైన్స్ అంతర్జాతీయ సదస్సు ముగింపు సభలో వక్తల మనోభావం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుస్తక విజ్ఞానాన్ని సామాన్య ప్రజల చెంతకు చేర్చాల్సిన బాధ్యత గ్రంథాలయాలపై ఉందని పలువురు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ లక్ష్య సాధనలో గ్రంథాలయాల పాత్ర'పై మూడు రోజులుగా ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో చేపట్టిన అంతర్జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) సలహాదారు డాక్టర్ జగదీష్ అరోరా మాట్లాడుతూ.. కాలానుగుణంగా గ్రంథాలయాలను సాంకేతికరించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా వికసిత్ భారత్ లక్ష్య సాధనకు గ్రంథాలయాలు తమవంతు పాత్రను పోషించాలని కోరారు. శిథిలమవుతున్న పుస్తకాలను డిజిటలైజ్ చేయాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ వెన్నం ఉమ కోరారు. తద్వారా ఆయా పుస్తకాల్లోని విలువైన విజ్ఞానాన్ని భవిష్యత్తుతరాలకు అందించాలన్నారు. ఎస్వీయూ రెక్టార్ అప్పారావు మాట్లాడుతూ.. లైబ్రరీ సైన్స్ విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఎంతో పురోగతిని సాధించిందన్నారు. యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయంలో చదువుకున్న వారు ప్రస్తుతం దేశ, విదేశాల్లో ప్రముఖ స్థానాల్లో ఉన్నారన్నారు. ఇన్‌ఫ్లిబ్‌నెట్ జాయింట్ కన్వీనర్ రాజా మాట్లాడుతూ.. విజ్ఞానానికి సాంకేతికతను జోడించాలని సూచించారు. పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ సేవుకన్ మాట్లాడుతూ.. పరిశోధనల్లో ప్రమాణాలను పెంచడానికి గ్రంథాలయాలు తోడ్పడాలని కోరారు. అంతర్జాతీయ సదస్సు విజయవంతానికి సహకరించిన వారికి సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ సురేంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. దూరప్రాంతాల నుంచీ హాజరై పేపర్, పోస్టర్, ఓరల్ ప్రజెంటేషన్ చేసిన ప్రతినిధులను అభినందించారు. దేశ, విదేశీ ప్రతినిధులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరించారు.

సదస్సు తీర్మానాలివే..

- 2047 నాటికి జ్ఞానాన్ని ప్రజాస్వామీకరించడానికి జాతీయ గ్రంథాలయ విధానాన్ని రూపొందించాలి.
- గ్రంథాలయ అధికారులు, సిబ్బందికి ఇన్-సర్వీస్ శిక్షణను అందించాలి.
- లైబ్రరీ సైన్స్ ఇంటర్న్‌షిప్‌ను క్రమబద్ధంగా నిర్వహించి విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి.
- లైబ్రరీ సైన్స్ పాఠ్యాంశాల్లో మార్పు చేర్పులు చేపట్టాలి.
- పీజీ స్థాయిలో అన్ని సబ్జెక్టుల్లో లైబ్రరీ సైన్స్ పేపర్ పెట్టాలి.
- గ్రంథాలయ పరిశోధన మండలి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.
- ప్లాగరిజంపై అవగాహన పెంచడానికి లైబ్రేరియన్లు-లైబ్రరీసైన్స్ విభాగాలకు ఓరియెంటేషన్ నిర్వహించాలి.
- ఉచితంగా లభించే ప్రచురణలు, స్వయం వంటి ఓపెన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించాలి.



ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

మంగళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సమీపంలో బోదనం టోల్‌ప్లాజా వద్ద బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసుల తనిఖీల్లో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టుచేసి 12 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ కారును సీజ్ చేశారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐలు వినోద్‌కుమార్, లింగాధర్ బృందాలు బుధవారం తెల్లవారుజామున కడివేడు ఫారెస్టు బీట్ పరిధిలోని బోదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. అటువైపుగా వస్తున్న కారు.. పోలీసులను గమనించి కొద్దిదూరంలో ఆగింది. అందులోని ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. కారులో తనిఖీ చేయగా 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు.పట్టుబడ్డ స్మగ్లర్లను, దంగలతో సహా కారును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుగా మారి.. నాట్లేసి

కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బుధవారం పెళ్లకూరు మండలం దిగువ చావాలి గ్రామం వద్ద పొలాల్లో వరి నాట్లు వేసి కర్షకుల్లో నూతనోత్సాహం నింపారు. నాయుడుపేటలో అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి వెళుతూ మార్గమధ్యంలో దిగువ చావాలి గ్రామం వద్ద ఆగారు. పొలాల్లో కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. రైతులు, కూలీలతో మాట్లాడారు. సమృద్ధిగా వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు చేసుకుంటున్నట్లు రైతులు తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలిస్తూ అధిక దిగుబడులు పొందేలా పని చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. వ్యవసాయ సమస్యలపై రైతులిచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి



వరినాట్లు వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ

జీవాలు, నాటుకోళ్ల పెంపకంతో రెట్టింపు ఆదాయం

- వెటర్నరీ వర్సిటీ వీసీ రమణ



తిరుపతిరూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పాడి, పాల ఉత్పత్తుల తయారీ, జీవాలు, నాటుకోళ్ల పెంపకాన్ని చేపట్టడం ద్వారా ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ పేర్కొన్నారు. వర్సిటీలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాడి పెంపకం, విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీ, గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు, పోషణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ లైవ్ స్ట్రీమింగ్ ప్రోగ్రామ్‌ను రైతులు వీక్షించే ఏర్పాట్లు చేశారు. వెటర్నరీ డీన్ ఆర్వీ సురేష్‌కుమార్, డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, డీఈ బి.శోభామణి, డెయిరీ టెక్నాలజీ అసోసియేట్ డీన్ జి.గంగరాజు, సీసీవీఈసీ కోఆర్డినేటర్ కె.సుజాత, వివిధ విభాగాల అధ్యాపకులు, రూరల్ మండల వెలుగు ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన మహిళా రైతులు పాల్గొన్నారు.

వినియోగంలో లేని బ్యాంకు ఖాతాల నుంచి
మీ నగదు తీసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లగా బ్యాంకు ఖాతాల్లో ఏ విధమైన ఆర్థిక లావాదేవీలు జరపకుండా ఉన్న మీ నగదును తిరిగి పొందవచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. 'మీ డబ్బు- మీ హక్కు' గోడపత్రికలను గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. మీ డబ్బు మీ హక్కు అనేనినాదంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రజలుతమ పేర్ల మీద ఉన్న ఖాతాల్లో పదేళ్లగా లావాదేవీలు జరపని నగదును పొందని ఎడల ధృవీకకరణపత్రాలు తీసుకుని మీ నగదు, ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం రిజర్వు బ్యాంకు కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో గడచిన పదేళ్లగా ఎలాంటిఆర్థిక లావాదేవీలు జరపకుండా 5,50,632ఖాతాలోల రూ.112.42కోట్లు నిల్వ ఉంద్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ మౌర్య, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజరురవికుమార్, మధుసూదన్, చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో లాక్కున్న భూమిని ఇప్పించండి

● పురుగుల మందు డబ్బాతో బాధితుడి నిరసన



పురుగు మందు డబ్బా చూపిస్తున్న కరుణాకరన్

వెదురుకుప్పం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో లాక్కున్న తమ భూమిని తిరిగి ఇప్పించాలంటూ కార్వేటినగరం మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వి.కరుణాకరన్ బుధవారం కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగు మందు బాటిల్‌తో నిరసన వ్యక్తం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..అన్నూరుకు చెందిన కరుణాకరన్‌కు 2015లో అల్లాగుంట గ్రామంలో తండ్రి నుంచి కొంత భూమి సంక్రమించింది. దీనిని గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు 2022లో రెవెన్యూ ఉద్యోగుల సహకారంతో తన పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. ఇందులో మామిడి చెట్లు కూడా ఉన్నాయి.అప్పటి నుంచి బాధితుడు కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయంలో, చిత్తూరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రయోజనం లేకపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎమ్మెల్యే థామస్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకూ వివాదం పరిష్కారం కాకపోవడంతో బుధవారం పురుగు మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేయాల్సి వచ్చిందని కరుణాకర్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ పెద్దలు చొరవ చూపి న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమన్నారు.

దివ్యాంగులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు సూచించారు. బుధవారం స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో దివ్యాంగుల పరికరాల నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు శిబిరంలోని ఏర్పాట్లను పరిశీలించారు. దివ్యాంగులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సాయం చేయాలని అధికారులకు సూచించారు. శిబిరానికి సుమారు వెయ్యి మంది వరకు దివ్యాంగులు, వృద్ధులు హాజరయ్యారు. వినికిడి యంత్రాలు, ఇతర పరికరాల కోసం 400 నుంచి 450 మంది వరకు నమోదు చేసుకున్నారని విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులు భావిస్తున్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, సహాయ కమిషనర్ ప్రసాద్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● ఎస్పీ తుషార్ డూడి



మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడి

పూతలపట్టు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆడపిల్లలు యాప్‌లు డౌన్‌లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ తుషార్ డూడి హితవు పలికారు. ముత్తిరేవుల సమీపాన ఎస్వీసెట్ కళాశాల ఆవరణలో బుధవారం డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. జీవితం చాలా అమూల్యమైనదని, ఏ సమస్య వచ్చినా ఆత్మహత్యకు పాల్పడరాదన్నారు. సైబర్ నేరాలు ప్రపంచమంతా విస్తరించిపోతోందని, టెక్నాలజీ ఎంత ప్రయోజనకరమో, దాన్ని తప్పుగా ఉపయోగించే వారు కూడా అంతే ప్రమాదకరమన్నారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, చాట్, డేటింగ్ యాప్స్ అక్రమ లింక్ డౌన్‌లోడ్ వంటి వాటి ద్వారా విద్యార్థులు తెలియకుండా ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయన్నారు. . విద్యార్థుల భద్రత కోసం ఈగల్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ సాయినాథ్, వన్ టౌన్ సీఐ మహేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథ రెడ్డి, రాజారెడ్డితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవమానం భరించలేక పాడిరైతు ఆత్మహత్యాయత్నం



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసింహులు శెట్టి

గంగాధరనెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవమానం భరించలేక ఓ పాడిరైతు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం ముక్కళత్తూరు పంచాయతీ ఎం.నాశంపల్లె గ్రామానికి చెందిన నరసింహులు శెట్టి కొన్నాళ్ళ క్రితం కుమార్తె పెళ్లి కోసం గజేంద్ర అనేవ్యక్తి దగ్గర కొంత సొమ్ము అప్పు తీసుకున్నాడు. తర్వాత వీరిద్దరి మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. ఐదురోజుల కిత్రం నరసింహులుశెట్టికి చెందిన పాడిఆవులను గజేంద్ర కుటుంబీకులు తీసుకుపోయారు. దీంతో నరసింహులుశెట్టి దంపతులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పాడిఆవులను వెంటనే రైతుకు అప్పగించాలని సీఐ శ్రీనివాసంతి ఆదేశించారు. గజేంద్ర పాడిరైతుకు ఆవులను అప్పగించాడు. ఈక్రమంలో సీఐ బుధవారం నరసింహులుశెట్టి, గజేంద్రలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. తాను తీసుకున్న రుణం ఆరునెలలోపు చెల్లిస్తానని నరసింహులు చెప్పాడు. దీంతో సర్దిచెప్పి ఇద్దరినీ పంపేశారు. అయితే నరసింహులు స్టేషన్ బయటకు వస్తుండగా. గజేంద్రతో పాటు అతని మనుషులు అవమానకరంగా దూషించారు. దీంతో మనస్థాపానికి గురైన నరసింహులుశెట్టి ఇంటికి వచ్చి పురుగులమందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్టేషన్‌బయట ఏం జరిగిందో తెలియదని, పూర్తిస్థాయిలో విచారించి నివేదికను ఉన్నతాధికారులుకు అందజేస్తామని సీఐ చెప్పారు.

అనుమతి లేకనే వ్యాన్ కొనుగోలు

● వైద్యశాఖ ఉన్నతాధికారి తీరుపై విమర్శలు

చిత్తూరు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పీహెచ్‌సీలకు మందులు సరఫరా చేసేందుకు ఇటీవల కొనుగోలు చేసిన ఈచర్ వాహనంపై దుమారం రేగుతోంది.రాష్ట్ర అధికారులకు తెలియజేయకుండానే నడుస్తున్న వాహనాన్ని పక్కన పెట్టి రూ.లక్షలు పోసి కొనాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆ శాఖ ఉన్నతాధికారి తీరుపై విమర్శలు రేగుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వాహనాలు కొనుగోలు చేయాలంటే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలోని స్టేట్ హెల్త్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్(ఎస్‌హెచ్‌టీఓ) అధికారికి తెలియజేయాలి. వారు అవసరాన్ని బట్టి నిధులను మంజూరు చేస్తారు. అయితే ఇక్కడ అటువంటిదేమీ చేయకుండా, వాహనాన్ని కొనుగోలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. అంతే కాకుండా వాహనం కొన్న రేటు విషయంలో కూడా తేడాలున్నట్లు డీఎంహెచ్‌వో కార్యాలయంలో చెప్పుకుంటున్నారు.

జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా.. తవణంపల్లెలో 21.6మి.మీ., రొంపిచెర్లలో 18.4, వెదురుకుప్పంలో 17.2,పెనుమూరులో 15.4, యాదమరిలో 14.8, గంగవరంలో 14.2, కార్వేటినగరంలో 13.6, పాలసముద్రం, పూతలపట్టు మండలాల్లో 12.4, ఎస్‌ఆర్‌పురంలో 10.6, సదుం, చిత్తూరు అర్బన్ మండలాల్లో 10.4, గుడిపాల, వి.కోట మండలాల్లో 10.2, పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో 10, పులిచెర్ల, జీడీ నెల్లూరు మండలాల్లో 9.8, ఐరాలలో 9.2, బైరెడ్డిపల్లెలో 8.4, చిత్తూరు రూరల్‌లో 8.2, శాంతిపురంలో 7.6, నగరిలో 7.2, సోమలలో 6.8, రామకుప్పంలో 6.4, విజయపురంలో 6.2, పెద్దపంజాణిలో 4.8, గుడుపల్లెలో 4.4, కుప్పంలో 4, నింద్రలో 3.2, చౌడేపల్లె, పుంగనూరు మండలాల్లో 2.2మి.మీ. చొప్పున వర్షం కురిసింది. నవంబరు సగటు వర్షపాతం 33.3 మిమీ కాగా అంతకుమించి బుధవారం నాటికి 35.7 మిమీ వర్షపాతం నమోదైంది.

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి

● ఎమ్మెల్యే గురజాల



రైతులకు నమూనా చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే అధ్యక్షతన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో రైతులకు పెట్టుబడిగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.5 వేలు, పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేలు అందిస్తున్నామన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 20,326 మంది రైతులకురూ.7.46 కోట్ల నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేశాయన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకాల ప్రారంభోత్సవాన్ని ప్రధాన మంత్రినరేంద్రమోదీ, సీఎం చంద్రబాబుల ప్రసంగాన్ని ప్రత్యక్షంగా రైతులు, ప్రజా ప్రతినిధులు తిలకించారు. రైతులకు మెగా చెక్‌ను అందించారు. కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ కాంద్ర రమేష్ నాయుడు, చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఝాన్సీ వెంకటేష్ యాదవ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, నేతలు సురేంద్ర కుమార్, బాలాజి నాయుడు, రఘు, జయచంద్ర నాయుడు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడ ఏర్పాటుకు భూసేకరణ

● రైతులతో ఎమ్మెల్యే, కలెక్టర్, ఏపీఐఐసీ అధికారుల సమావేశం



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

విజయపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయపురం మండలంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటులో భాగంగా భూసేకరణకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఏపీఐఐసీ అధికారులు రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు భరోసా కల్పించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రైతులతో చర్చించాక ఎకరాకు రూ.14 లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. పండ్ల చెట్టు ఉంటే అధనంగా చెల్లిస్తామన్నారు. 40 సంవత్సరాల పాటు అనుభవంలో ఉన్న భూములకు కూడా పరిహారం వర్తిస్తుందన్నారు. పరిశ్రమ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పరిశ్రమల రాకతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. సీ బ్లాక్‌లో 470 ఎకరాలను మొదటి విడతగా తీసుకుంటామన్నారు. నిర్వాసిత కుటుంబాల్లో అవకాశం ఉంటే ఒకరికి ఉపాధి కల్పించాలని రైతులు కోరడంతో కలెక్టరు సానుకూలంగా స్పందించారు. అనంతరం రూ. 67 లక్షలతో చేపట్టిన తొమ్మిది సిమెంటు రోడ్లను ప్రారంభించారు. పలువురు తమ సమస్యలపై కలెక్టరు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో అనుపమ, ఎంపీడీవో రాజేంద్ర, ఏఈలు, ఏపీఐఐసీ అధికారులు, రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల డైరెక్టరు చినబాబు, ఏఎంసీ ఛైర్మన్ రాజమ్మ, జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్, నాయకులు రమేష్‌రాజు, బాబుయాదవ్, దశరథరాజు, సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జంట ఏనుగుల దాడులు

● గ్రామాల్లో అటవీశాఖ అధికారుల సూచనలు



ఏనుగుల దాడిలో పాక్షికంగా ధ్వంసమైన వరిపంట, రామకుప్పం-89 పెద్దూరు రహదారిలో జంట ఏనుగులు, ననియాలలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

రామకుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో పొలాలు, మామిడి తోటలపై జంట ఏనుగుల దాడుల పరంపర కొనసాగుతోంది. దాడులతో అటవీజనం భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. మంగళవారం రాత్రి జంట ఏనుగులు ననియాలతండా సమీప పొలాలు, తోటలపై దాడులు చేశాయి. వరి, రాగి, టమోటా పంటల్లో తిరుగుతూ ధ్వంసం చేశాయి. ఓ రైతుకు చెందిన మామిడి చెట్ల కొమ్మలను విరిచేశాయి. ఏనుగులు ప్రతి రాత్రి పొలాల వైపు వస్తుండటంతో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. జంట ఏనుగులు ననియాలతండా సమీపంలోని కూటల్లవంకల్లో ఉన్నట్లు తెలిపారు. అవి ననియాల, ననియాలతండా, నారాయణపురంతండా, రామాపురంతండా, జీడిమాకులపల్లె గ్రామాల సమీపంలో పొలాలు, తోటల్లో ప్రవేశించే అవకాశాలున్నాయని .. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఏనుగులు, పొలాలు, గ్రామాల వైపు వస్తే వెంటనే ఫోన్‌నంబర్లు 919668651, 6301667521 లకు వెంటనే సమాచారమివ్వాలని కోరారు.

నేడు రాష్ట్రపతి రాక

● భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ స్వాగతం పలకనున్న మంత్రులు



భద్రతాఏర్పాట్లపై చర్చిస్తున్న అదనపు ఈవో, కలెక్టర్, భద్రతాధికారులు

తిరుమల, తిరుపతి(కలెక్టరేట్/నేరవిభాగం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం తిరుమల రానున్నారు. రేణిగుంటలోని విమానాశ్రయం వద్ద ఆమెకు స్వాగతం పలికేందుకు గవర్నర్ రావాల్సి ఉన్నా.. చివర్లో పర్యటన రద్దయింది. దీంతో హోంమంత్రి అనిత, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు..తిరుచానూరు పద్మావతీ దేవి ఆలయం వద్ద దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ అధికారులు స్వాగతం పలకనున్నారు. ఒడిశా నుంచి రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో గురువారం సాయంత్రం 4గంటలకు రేణిగుంటకు చేరుకుంటారు. రోడ్డు మార్గాన 4.30గంటలకు తిరుచానూరుకు వచ్చి పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. 5.20 గంటలకు బయలుదేరి తిరుమలకు వెళ్లి పద్మావతి అతిథి గృహంలో బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9.20గంటలకు వరాహస్వామిని. ఆ తర్వాత శ్రీవారి ఆలయానికి చేరుకుని మూలమూర్తిని దర్శించుకుంటారు. 11 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు రేణిగుంటలోని విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు బయలుదేరతారు. కాగా విజయవాడలోని ఓ ఇంట్లో మావోయిస్టులను అదుపులోకి తీసుకోవడం వంటి ఘటనలతో రాష్ట్రపతి పర్యటనకు భారీ భద్రత ఏర్పాటు చేశారు. డీఐజీ షిమోషీ నేతృత్వంలో ఎస్పీ సుబ్బరాయుడు, ఐదుగురు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 50 మంది సీఐలు, 100 మంది ఎస్‌ఐలు, 300 మంది పోలీసులు, రోడ్డు ఓపనింగ్ పార్టీలు, రోప్ పార్టీలు, బాంబు, డాగ్ స్క్వాడ్‌లు, పారా మిలటరీ దళాలు, రిజర్వు బలగాలు, ఏరియా డామినేషన్ పార్టీలను బందోబస్తు నిమిత్తం నియమించారు.

మహిళలకు అవకాశమిస్తే అద్భుతాల సృష్టి

● నారా భువనేశ్వరి



మహిళా పారిశ్రామికవేత్తల సమావేశాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న భువనేశ్వరి

కుప్పం/గుడుపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా ఆమె బుధవారం సాయంత్రం ద్రావిడ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అలీప్ ప్రాజెక్టు ద్వారా శిక్షణ పొందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. మహిళల ఆర్థిక స్థితి మెరుగుపరచి వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడడం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను అభివృద్ధి పరిచారన్నారు. ఈ క్రమంలోనే మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు. ఎలీప్ ప్రాజెక్టును అందుకే కుప్పంలో అమలు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలకు శిక్షణ అందించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. శిక్షణ పొందిన తర్వాత తమకు ఆసక్తి కలిగిన రంగంలో మరింతగా ఎదిగేందుకు తగిన ప్రోత్సాహం ఇస్తామన్నారు.భవిష్యత్తులో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇందుకోసం పరమసముద్రం వద్ద 14ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కుటుంబంలో, వ్యాపారంలో ఎదురయ్యే అనేకరకాల సమస్యలను ఎదుర్కొని ధైర్యంగా ఎదగాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాల పట్టాలను భువనేశ్వరి పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ ఛైర్మన్ పీఎస్. మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, అలీప్ మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గంగాధరనెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-పుత్తూరు రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గంగాధరనెల్లూరు నుంచి చిత్తూరు వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తిని ముద్దకాల్వ పంచాయతీ ఎల్లమరాజుపల్లె బస్టాప్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. బస్ లారీని ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఈ సంఘటన జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి ద్విచక్రవాహనం నంబర్ ప్లేట్‌పై ఏపీ 03 ఏహెచ్ 3926 అని ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వర్ణమ్మకు గంగా హారతి



నదీహారతులు ఇస్తున్న వేదపండితులు (ఇన్‌సెట్‌లో) గంగాదేవి ఉత్సవమూర్తి

శ్రీకాళహస్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం.. అమావాస్యను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నదికి గంగా హారతులిచ్చారు. తొలుత ముక్కంటి ఆలయం నుంచి గంగాదేవి ఉత్సవమూర్తిని స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. నదీ జలాలకు, ఉత్సవమూర్తికి పండితులు పూజలు చేశారు. గంగాదేవికి శాస్త్రోక్తంగా సారె సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అర్చకులు స్వర్ణమ్మకు ద్వాదశ హారతులు పట్టారు. ఆగమ నియమాల ప్రకారం వివిధ రకాల హారతులను వరుసగా గంగమ్మకు సమర్పించారు. పలువురు భక్తులు నదీ దీపాలు వెలిగించారు.

ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్

చిత్తూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మూడు కేంద్రాల్లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరి పరీక్ష-2026కు సంబంధించి ఉచిత శిక్షణతో ఇవ్వనున్నారు. వసతి సౌకర్యాన్ని కూడా కల్పించనున్నారు విజయవాడకు 120 సీట్లు, తిరుపతికి 120 సీట్లు, విశాఖపట్నంకు 100 సీట్లను ప్రభుత్వం కేటాయించారు. ఈ సీట్లలో ఎస్సీ అభ్యర్థులకు 240సీట్లు, ఎస్టీ అభ్యర్థులకు 100 సీట్లను కేటాయించారు. అభ్యర్థులు దరఖాస్తులో సెంటర్లకు ఆప్షన్లను పెట్టుకోవాలి. వారి మెరిట్ ఆధారంగా సెంటర్లను కేటాయిస్తారు. జనరల్ స్టడీస్ (పేపర్-1), సీసాట్(పేపర్-2) తరగతులతో పాటు ప్రింట్, స్టడీ మెటీరియల్ అందజేస్తారు. డిగ్రీ ఉత్తీర్ణులై కుటుంబ వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు మించకూడదు.

● ఎంపిక ప్రక్రియ ఇలా..

ఈ నెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. మర్నాడు నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ నెల 3న జిల్లా కేంద్రంలో ఓఎంఆర్ బేస్డ్ స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది. డిసెంబరు 10 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభిస్తారు. శిక్షణలో స్టడీ మెటీరియల్స్‌ను ఉచితంగా అందిస్తారు. అభ్యర్థులు https\\apstudycircle.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో నిర్ణీత గడువులోగా విద్యార్థతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలి.

పాళెంలో ఒంటరి ఏనుగు దాడి



ఒంటరి ఏనుగు ధ్వంసం చేసిన ట్రాక్టర్

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాళెం పంచాయతీలో మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు కోటబావి మీదుగా పాళెం వద్దకు చేరుకొంది. మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్ మామిడితోటలోకి ప్రవేశించిన ఒంటరి ఏనుగు మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. కుక్కలు ఒక్కసారిగా మొరగడంతో అక్కడి నుంచి ఒంటరి ఏనుగు జూపల్లి వద్దకు చేరుకొంది. కల్లూరులోని పలువురికి అక్కడి నుంచి ఆంజనేయస్వామి గుడి మీదుగా కోటపల్లి గ్రామంలోకి చేరుకొని ఇంటి ముందు ఉంచిన గోపికి చెందిన ట్రాక్టర్ ను ధ్వంసం చేసింది. అనంతరం మార్గంలోని రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకుంది. బుధవారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద సంచరించినట్లు అటవీ సిబ్బంది తెలిపారు.

నారా భువనేశ్వరికి ఘనస్వాగతం



భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న తెలుగు మహిళలు, ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం తదితరులు

రామకుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులు కుప్పం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె వద్ద పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో చెల్దిగానిపల్లెకు చేరుకున్న ఆమెకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని నేతలు, కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలికి ఫొటోలు దిగారు. గ్రంథాలయ పరిషత్ డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణానాయక్, నరసింహులు, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అప్పు ముఖేశ్ తదితరులు

కుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం 14వ వార్డు పరిధిలోని ఇందిర కాలనీలో నివాసముండే పేద కుటుంబానికి చెందిన పాపమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. కొత్తపేట టీడీపీ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్ ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చులకుగాను రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాహుల్, టి.సుకుమార్, అలగేశ్, అచ్చిదన్, గ్రామ పెద్దలు మునియప్ప, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమర్‌కు ముస్లింల సన్మానం



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న ఖాజీ ఫక్రుద్దీన్ తదితరులు

గంగవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎమ్మెల్యే అమరనాధరెడ్డిని బైరెడ్డిపల్లెకు చెందిన ఖాజీ ఫక్రుద్దీన్ మండల నాయకులతో బుధవారం ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. బైరెడ్డిపల్లె మండలం కడపనత్తం గ్రామానికి చెందిన ఫక్రుద్దీన్‌ను బైరెడ్డిపల్లె మండల ఖాజీగా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఆదేశాలందాయి. దీంతో ఆయన ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనను మండలంలోని 17 మసీదులకు ఖాజీగా నియమిస్తూ ఉత్తర్వులు అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లె అధ్యక్షులు కిషోర్‌గౌడు, సింగిల్‌విండో నాగరాజ, ఖాజీపీర్, ఇమామ్‌సాబ్, పాల్‌రసూల్ బాషా, హఫీజ్ హుస్సేన్, ఇబ్రహీం, ఆసీఫ్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్, వైద్య సిబ్బంది

గంగవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలు పోషకాహారం అలవాటు చేసుకొని ఆరోగ్యకర జీవనాన్ని సాగించాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రపంచ ఏఎంఆర్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఆరోగ్యకర జీవనంపై మహిళలకు మున్సిపల్ , వైద్య అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మొహిద్దీన్, డాక్టర్లు యుగంధర్, ఆర్‌ఎంవో లత, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేస్తేనే టీడీపీ అభివృద్ధి



పాళ్యంపల్లెలో గ్రామకమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్న టీడీపీ పరిశీలకుడు ప్రతాప్‌రాజు

పుంగనూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయి నుంచి బలపడేలా పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పని చేయడానికి కృషి చేయాలని టీడీపీ పరిశీలకులు తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ మహేశ్‌యాదవ్, ప్రతాప్‌రాజులు పిలుపునిచ్చారు. బుధవారం పుంగనూరు పట్టణ, రూరల్ మండలాల్లో వార్డు, గ్రామకమిటీలకు సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలుచోట్ల మాట్లాడుతూ టీడీపీలో విభేదాలు సృష్టించి ప్రత్యర్థి పార్టీ లబ్ధిపొందాలని చూస్తుందని పార్టీ శ్రేణులు వేరే పార్టీ ఉచ్చులో పడరాదని సూచించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి కారణంగా నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గత ఐదేళ్లు ఎన్నో అవమానాలు, ఇబ్బందులు, అక్రమ కేసులు, నష్టాలు, కష్టాలు ఎదుర్కొని జైళ్లలో మగ్గారని గుర్తు చేశారు. పార్టీ అధిష్టానం ఆదేశాలతో నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సదుం, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో టీడీపీ ఎన్నికలు బుధవారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు కె.అమరనాథరెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, పలువురు మండల ఎన్నికల పరిశీలకులతో ఎన్నిక నిర్వహిస్తున్నామన్నారు. పుంగనూరులో కొందరు స్థానికులపై ఆరోపణలు, విమర్శలు చేయగా ఏదైనా ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే అధిష్టానానికి పంపుతామని తెలిపారు. పుంగనూరు పట్టణం, రూరల్ మండలంతోపాటు సదుం మండలంలో టీడీపీ ఎన్నికలు జరిగాయి. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె, బోడేవారిపల్లె, నేతిగుట్లపల్లె, పాళ్యంపల్లె, నల్లగుట్టపల్లెతాండా, సుగాలిమిట్టలకు గ్రామ కమిటీ అధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డి, రెడ్డెప్ప, కిరణ్‌కుమార్, రామకృష్ణనాయక్, వెంకటరమణనాయక్, రూపేంద్రనాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు పరిశీలకుడు ప్రతాప్‌రాజు తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శమిపతియాదవ్, టీడీపీ నాయకులు కృష్ణానాయక్, గంగాధర్, రాఘవ, కోలాట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే పుంగనూరు వార్డుల అధ్యక్ష, కార్యదర్శులుగా శివశంకర్, మంజునాథ్, భాస్కర్‌రాజు, విజయభాస్కర్, సరస్వతి, సుధా, జి.విజయకుమారి, వెంకటమ్మ, ఎం.దినేశ్, జీవనజ్యోతి, ఎస్. సయ్యద్‌అలీ, వెంకటేశ్, బాబు, వెంకట్రామయ్య, ఎం. రామకృష్ణమరాజు, ఎస్.అస్లామ్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్టు పట్టణ పరిశీలకుడు మహేశ్‌యాదవ్ తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఎం.శ్రీకాంత్, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, ఇబ్రహీం, షామీర్, దేశాధి ప్రకాష్, రామయ్య, రమేశ్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కార్యకర్తలందరికీ గుర్తింపు



ప్రభాకర్‌తో టీడీపీ నాయకులు

సోమల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు ఎం. ప్రభాకర్ తెలిపారు. బుధవారం సోమల మండలంలోని నెల్లిమంద, తమ్మినాయనపల్లె, వల్లిగట్ల, కందూరు పంచాయతీల సమన్వయ కమిటీలు జరిగాయి. మండల పార్టీ అధ్యక్షుడు సి.సుబ్రహ్మణ్యం నా యుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు వీపీ. శివశంకర్, మాజీ సర్పంచి హరిప్రసాద్, సతీశ్ నాయుడు, పి. శ్రీనివాసులు, విశ్వనాథం, జయచంద్ర, పురుషోత్తంనాయుడు, సుబ్బరాయుడు, చంద్రబాబు, రమణయ్య, మదన్‌మోహన్‌రెడ్డి, వరాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరం పరిశీలన



సదుం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సదుం ఉన్నత పాఠశాల ఆవరణలో పుంగనూరు నియోజకవర్గ స్థాయిలో గురువారం నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన సహాయక పరికరాల గుర్తింపు శిబిరాన్ని ఆర్డీవో భవానీ బుధవారం పరిశీలించారు. వసతి ఏర్పాట్లు, వైద్యుల వసతుల కల్పన, నిర్వహణ విధానంపై స్థానిక తహసీల్దారు ప్రమీల, సిబ్బందికి ఆర్డీవో పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఐఈఆర్‌డీ విశ్వనాథ్, ఎంఈవో దామోదర్, పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కల్లూరు విద్యార్థి



మహేష్

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మహేష్ రాష్ట్ర స్థాయి అండర్-14 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్, రెడ్డిప్రవీణ తెలిపారు. కల్లూరు ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం మాట్లాడుతూ చిత్తూరు జిల్లా బీఎన్ కండ్రిగలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో మహేష్ ప్రత్యేక ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మహేష్‌ను ఎంపిక చేశారన్నారు. ఈనెల 22న కృష్ణాజిల్లాలో జరిగి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో మహేష్ పాల్గొంటారని ఆమె తెలిపారు.

పచ్చని చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ



కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పచ్చదనం, పరిశుభ్రతపై ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ట్రైనర్లు రమేష్, ప్రవీణ్‌కుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడంతోనే జ్ఞానం



మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి తులసీనాయక్

పుంగనూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠ్యపుస్తకాలు చదవడంతో జ్ఞానవంతులు అవుతారని గ్రంథాలయాధికారి తులసీనాయక్ చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని లినార్డు మున్సిపల్ పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. సమావేశంలో ఉర్దూ అకాడమి లైబ్రేరియన్ నసీబ్‌జాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రుద్రాణి, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



● **చౌడేపల్లె:** గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు సోమశేఖరయ్య మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అలాగే స్థానిక హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం భరోసా

రామకుప్పం, నవంబరు 19 (ఆంధజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ వంచనలతో రైతులు అష్టకష్టాల పాలయ్యారని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ పాలనలో రైతు సంక్షేమం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితమైందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కార్యక్రమం రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందన్నారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత రైతులకు భరోసా ఇస్తూ ఎన్నో పథకాలతో లబ్ధి చేకూరుస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ రైతాంగం కోసం హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తి చేయించి కుప్పం వరకు కృష్ణాజలాలను తీసుకొచ్చి రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి కష్టాలకు చరమగీతం పాడారన్నారు. గిట్టుబాటు ధరల్లేక కొట్టుమిట్టాడుతున్న మామిడి రైతులకు మద్దతు ధర సాయం అందించి ఆదుకున్నారనిని తెలిపారు. రాయితీలతో విత్తనాలు, వ్యవసాయ పరికరాలను అందిస్తున్నామని తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కుప్పంలో నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ జీఎం.రాజు తదితరులు



పుంగనూరు: రైతులకు నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు



రొంపిచెర్లలో నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మునిరాజు అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులను ప్రభుత్వం వారివారి అకౌంట్లలో జమ చేసిన సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులతో సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన కార్యక్రమాన్ని డిజిటల్ స్క్రీన్లపై వీక్షించారు. అనంతరం కుప్పం నియోజకవర్గ పరిధిలోని 36,473 మంది రైతులకు మొత్తం రూ.23.45 కోట్ల నగదును వారివారి అకౌంట్లలో జమ చేశారు. సంబంధిత చెక్కును కార్యక్రమంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడా పీఏసీ సభ్యుడు రాజ్‌కుమార్, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● **గంగవరం** : అన్నదాత సుఖీభవతో ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాధరెడ్డి అన్నారు. బుధవారం పలమనేరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన అన్నదాత సుఖీభవచెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు అన్నదాత సుఖీభవ పథకంతో పలమనేరు నియోజకవర్గానికి రూ.25.83 కోట్లు రైతుల ఖాతాలకు అందడం సంతోషంగా ఉందన్నారు. బాలాజీ సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్‌వీ బాలాజీ, టీడీపీ మండలాధ్యక్షులు కిషోర్‌గౌడు, సోమశేఖర్‌గౌడు, ఆనంద్, నాయకులు ఖాజా, సుబ్రహ్మణ్యం గౌడు, నాగరాజు, దిలీప్‌కుమార్ , వ్యవసాయ శాఖ అధికారులు సంధ్య, రఖీబ, హేమలత, అప్రోజి, గీత కుమారి, సిరికల్చర్ అధికారి ఫిరోజ్‌బాషాలతోపాటు పలువురు అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతుల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తున్నారని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్లలో ఎంపీడీవో సమావేశం హాలులో బుధవారం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్



గంగవరం: అన్నదాత సుఖీభవ నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పథకంలో భాగంగా రెండో విడత నిధులను విడుదల చేయడం గర్వకారణమన్నారు. అనంతరం సబంధిత చెక్కును చల్లా రామచంద్రారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయాధికారి శ్రావణి, పశువైద్యాధికారి డాక్టరు ఉష, సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు ఓబులేశ్వరరెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్లు చెంగల్‌రెడ్డి, ఈశ్వరయ్య, నాయకులు రఘునాథ్, రామ్మూర్తి, బాబులాల్, రైతులు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ శమిపతి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు కూటమి ప్రభుత్వంపై బురద చల్లడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేకపోయినా సీఎం చంద్రబాబునాయుడు రైతుల సంక్షేమం కోసం రుణాలు అందజేస్తున్నట్లు వివరించారు. పుంగనూరు ఏడీఏ శివకుమార్, సింగిల్‌విండో చైర్మన్ పగడాల రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు జగదీష్‌రాజు, కోలాట వెంకటరమణ, చైతన్యరాయల్, కవిత, ఏవోలు జ్యోతి, రాధ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పార్థివలింగ పూజ



పార్థివ లింగానికి పూజలు చేస్తున్న అర్చకులు



పార్థివ లింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

పుంగనూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస అమావాస్య సందర్భంగా అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా సామూహిక పార్థివలింగ పూజ, నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు బాలసుబ్రహ్మణ్యంస్వామి, రామచంద్రస్వామి ఆధ్వర్యంలో ఉచితంగా గత 15 ఏళ్లుగా ప్రతి కార్తీకమాసంలో అమావాస్య సందర్భంగ సామూహిక ఉచిత పార్థివ లింగ పూజలు నిర్వహిస్తున్నారు. 11 పుట్టల మట్టి, వట్టివేర్లు తదితర పదార్థాల మిశ్రమంతో తయారు చేసిన 300 పార్థివలింగాలను అర్చకులు ఉచితంగా అందజేసి పెద్ద పార్థివలింగానికి భక్తిశ్రద్ధలతో లింగాలకు ప్రాణప్రతిష్ఠ చేసి పంచామృత, పూజా ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు బాలసుబ్రహ్మణ్యం స్వామి, రామచంద్రస్వామిలు చేస్తున్న పూజలు గమనిస్తూ 300 మంది కుటుంబాలు వారి వద్ద ఉన్న లింగాలకు పూజలు చేశారు. అనంతరం అన్నంతో అభిషేకం చేశారు. అనంతరం పార్థివలింగాన్ని హంద్రీ-నీవా కృష్ణా జలాల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కమలాకర్, పట్టణ ప్రముఖులు వెంకటేశ్, మున్సిపాలిటీ శివకుమార్, రవిచంద్ర, ఎంపీఐ సుప్రియ, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం



విద్యుత్ అధికారులకు సమస్యను వివరిస్తున్న రైతు

పుంగనూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్పీడీసీఎల్‌కు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరించుకోవడానికి వేదికగా ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి తెలిపారు. బుధవారం స్థానిక విద్యుత్ డీఈఈ కార్యాలయం వద్ద ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహించగా నాలుగు ఫిర్యాదులు రాగా విచారించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విద్యుత్ అదాలత్ కార్యక్రమంలో అధికంగా ఫిర్యాదులు వచ్చేవని, ప్రస్తుతం ఫిర్యాదుల సంఖ్య తగ్గిందన్నారు. విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. కాగా పుంగనూరు మండలం రాగానిపల్లెకి చెందిన వెంకటరెడ్డి తన తాత్కాలిక సర్వీసును రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదు చేయడంతో వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సమావేశంలో విద్యుత్ అదాలత్ సభ్యులు జి.మధుకర్, విజయలక్ష్మి, చిత్తూరు ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, పుంగనూరు డివిజన్ ఈఈ శ్రీనివాసమూర్తి, పుంగనూరు, సదుం, పలమనేరు ఏడీఈలు పి.శ్రీనివాసులు, నరేంద్ర, జీవన్‌రెడ్డి, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటు

చౌడేపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలంలో టీడీపీ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పరిశీలకులు పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పుంగనూరు నియోజకవర్గం అబ్జర్వర్ శాప్ చైర్మన్ రవినాయుడు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచనలతో గ్రామ స్థాయి నుంచి టీడీపీని బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో టీడీపీ సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్త హాజరు కావాలని కోరారు. సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని.. కార్యకర్తలకు అండగా ఉండే నాయకులను, వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేసే వ్యక్తులను గ్రామ కమిటి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సూచించారు. నాయకులు పోటీలు పడితే ఐవీఆర్‌ఎస్ కాల్స్‌తో పార్టీ అధిష్టానం అధ్యక్షులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గొడవలు సృష్టించాలని చూస్తే అక్కడికక్కడే క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

చౌడేపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి 6134 మంది రైతులని ఏవో మోహన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 6134 మంది రైతులు అన్నదాత సుఖీభవతో రూ.3.07 కోట్లు, పీఎం కిసాన్ 21వ విడతకు 5,233 మంది రైతులకు రూ.1.0466 కోట్లు, మొత్తం రూ.4.1136 కోట్లు నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నట్లు తెలిపారు.



ద్రావిడ వర్సిటీలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న ఆయన కుమార్తె భువనేశ్వరి తదితరులు

చదువులమ్మ బడిపై పూర్వ విద్యార్థుల మమకారం

●రూ.6.25 లక్షలతో నిర్మించిన ప్రార్థనా మందిరం ప్రారంభం



కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చదువులమ్మ బడిపై పూర్వ విద్యార్థులు అందించిన మమకారం అమోఘమని ప్రముఖ పారిశ్రామిక వేత్త వారణాశి సౌమినిరెడ్డి తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 61 ఏళ్ల క్రితం (1964-65 బ్యాచ్) ఎస్ఎస్ఎల్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు సుమారు 75 నుంచి 80 ఏళ్ల మధ్య వయసున్న పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల ఆవరణలో రూ.6.25 లక్షలతో నిర్మించిన ప్రార్థనా మందిరాన్ని బుధవారం అట్టహాసంగా ప్రముఖ పారిశ్రామికవేత్త వారణాశి సౌమినిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు అనే సరికి ఆత్మీయ సమ్మేళనలు నిర్వహించుకోవడం, ఉపన్యాసాలతో ముగించడం, విందు భోజనాలు ఆరగించడం సాధారణంగా జరిగేదన్నారు. 61 ఏళ్ల క్రితం చదువుకున్న పాఠశాలకు ఏదో చేయాలనే తపనతో ప్రార్థనా మందిరం నిర్మించడం విద్యార్థి లోకానికి ఆదర్శమన్నారు. వయస్సు మీదపడినా తామూ పూర్వ విద్యార్థులమే అని చాటి చెప్పిన ఈ పూర్వ విద్యార్థుల అడుగుజాడల్లో మనందరం నడవాలని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులను పాఠశాల తరపున ఘనంగా సన్మానించారు. రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథంనాయుడు, ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, హెచ్‌ఎం లక్ష్మీదేవి, ఎస్ఎంసీ చైర్మన్ అక్బర్, పూర్వ విద్యార్థులు రెడ్డెప్పనాయుడు, తిరువెంగళం పిళ్లై, భాస్కర్‌నాయుడు, రామనాథం, చంద్రారెడ్డి, రమాదేవి, పార్వతమ్మ, కృష్ణవేణి, శ్రీనివాసులు, కరీం, సామిరెడ్డి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చౌడేశ్వరమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

రామకుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం-రాజుపేట క్రాస్ రహదారిలో మిట్టపల్లె పెద్దచెరువు సమీపంలో నిర్మించిన చౌడేశ్వరమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరుగుతాయిని గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం గోపూజ, గంగపూజ, గణపతిపూజ, ఋత్విక్ వరుణం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. శనివారం ఉదయం గణపతిపూజ, వాస్తుపూజ, వనపూజ, అష్టదిక్పాలకుల పూజ, నవగ్రహారాధన, సాయంత్రం జలాధివాసం, పంచామృతాధివాసం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆదివారం తెల్లవారుజామున 4.30-5.30 గంటల మధ్య అమ్మవారి మూల విగ్రహ ప్రతిష్ఠాపన, నేత్రోన్మీలనము, కళాహోమం, బలి, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని, అనంతరం మహామంగళ హారతి, ప్రసాద వినియోగంతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు.

తాగునీటి ట్యాంకుల పరిశీలన

సోమల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో పలు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులను మండల ప్రత్యేకాధికారి సూరిబాబు పరిశీలించారు. బుధవారం పుట్టావారిపల్లె, అడుసుపల్లె, సోమలలోని నీటి ట్యాంకులను అధికారులు సందర్శించారు. ఈక్రమంలోనే ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులపల్లెలో కూలడానికి సిద్ధంగా ఉన్న ట్యాంకును కూల్చివేయాలని గ్రామస్తుల వినతితో ట్యాంకును పరిశీలించారు. ఎంపీడీవో జీవీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏఈలు మణికంఠ, అనూష, గనేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

సోమల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులు సొంతింటి నిర్మాణానికి సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని హౌసింగ్ ఏఈ మణికంఠ తెలిపారు. బుధవారం సోమల పంచాయతీలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటి స్థలాలను పరిశీలించారు. అడుసుపల్లె, ముండ్రివారిపల్లె గ్రామాల్లో ప్రత్యేక సర్వే చేశారు. సింగిల్ విండో చైర్మన్ శివశంకర్, మహేంద్రబాబు, గణేష్ పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఉన్నతికి సోపానాలు గ్రంథాలయాలు


కృష్ణస్వామిరాజును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

వెదురుకుప్పం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానభాండాగారాలైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే విజయతీరాలకు సులభంగా చేరుకోవచ్చని కథా రచయిత ఆర్‌సీ కృష్ణస్వామిరాజు చెప్పారు. బుధవారం కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాను రచించిన 25 పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. కథారచయిత మూరిశెట్టి గోవిందు, మునస్వామి నాయుడు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు అతిథులను సన్మానించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతావిజయులురెడ్డి, గ్రంథాలయాధికారి ఆర్.అన్బలగన్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల వితరణ



పెనుమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న 117 మంది విద్యార్థులకు మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు బుధవారం ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా ఆయన బస్టాండులో అన్నదానం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రమేష్, టీడీపీ నేతలు కార్యకర్తలు భారీ కేక్ కోశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, చిరంజీవిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, భాస్కర్, కిషోర్‌నాయుడు, ఈశ్వర్‌నాయుడు, యువరాజులునాయుడు, ప్రసాద్‌రెడ్డి, ఏకాంబరం, విశ్వనాధరెడ్డి, అశోక్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ జలాల సరఫరాకు చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న వెంకటరమణ

పాలసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురవడం వలన తాగునీటి పైపులైన్లు లీకయితే మరమ్మతులు చేయించాలని సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో షతీష్, తహసీల్దార్ గుర్రప్ప, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


మాట్లాడుతున్న రోజారమణి

వెదురుకుప్పం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా జాతీయ బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.రోజారమణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలలు సత్ప్రవర్తనతో చదువుకుంటే మంచి పౌరులుగా గుర్తింపు పొందుతారన్నారు. బాలల హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలని సూచించారు. హెచ్‌ఎం జి.కోటేశ్వరరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.● వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో కార్వేటినగరం ఐసీడీఎస్ సీడీపీవో పగడాల శోభారాణి ప్రసంగించారు. కిశోర బాలికలు గుడ్-బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. **నింద్ర:** చవరంబాకంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ బాలల హక్కు,విధులు సహాయం గురించి అవగాహన కల్పించారు. పౌష్టికాహారం వాటివలన కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు.

మూల్యాంకన పత్రాల పరిశీలన


మూల్యాంకన పత్రాలను పరిశీలిస్తున్న ఏఎస్‌వో చాంద్‌బాషా

ఐరాల(కాణిపాకం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠాలలో వెనుకబడిన విద్యార్థుల స్థాయిని పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సర్వశిక్షా అభియాన్ ఏఎస్‌వో చాంద్‌బాషా అన్నారు. బుధవారం ఆయన కాణిపాకంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మూల్యాంకన పత్రాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల స్థాయిని మౌఖికంగా చూశారు. ఎంఈవో రుష్యేంద్రబాబు, సీఆర్పీ కల్పన, ఉపాధ్యాయులు హరిత, కవిత, విజయకుమారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడిపాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బసవాపల్లె పంచాయతీ కోలావూరు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శివకుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



నగరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని వ్యాసరచన, డ్రాయింగ్, వకృత్వ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయలు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు, ఉపాధ్యాయులు భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

చిత్తూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలింతలకు ప్రొటీన్ ఫుడ్ అందించారు. బుధవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో సత్యసాయిసేవా సంస్థ ఆధ్వర్యంలో బాలింతలకు ప్రొటీన్ ఫుడ్, చిన్న పిల్లలకు దుస్తులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ అధ్యక్షుడు మధుసూదనం తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



తవణంపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసిన సందర్భంగా బుధవారం జొన్నగురకల సచివాలయం వద్ద రైతులు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు మధు, షబ్బీర్ భాష, జయపాల్, భరత్, వినోద్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ రవికుమార్

నింద్ర, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకంలోని కూలీలకు పని దినాలు కల్పించే బాధ్యత క్షేత్ర సిబ్బందేనని డ్వామా పీడీ రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కూలీలకు విరివిగా పనులు కల్పించాలని, పనులు వేగవంతం చేయాలని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో చంద్రశేఖర్, జాబితా మోహన్, శ్రీధర్(ఈసీ), టీఏలు సుశీల, ఏసుదాస్, సీవోలు గిరీష్, సుధాకర్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

2,941 మందికి అన్నదాత సుఖీభవ లబ్ధి

పాలసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ద్వారా మండలంలో 2941 మందికి లబ్ధి చేకూరిందని మండల వ్యవసాయ అధికారి డిల్లిబాబు తెలిపారు. వీరికి వారి ఖాతాలలో రూ.1.91 కోట్లు జమైనదన్నారు. సొమ్ము జమ కాకపోతే రైతులు రైతు సేవా కేంద్రాలలో ఉద్యోగులను సంప్రదించాలని ఆయన రైతులకు సూచించారతు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


హేమలతను సత్కరిస్తున్న ప్రముఖులు

చిత్తూరు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చుడా చైర్‌పర్సన్ హేమలత అన్నారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హేమలత మాట్లాడుతూ ఆపరేషన్ సింధూ కూడా ఇద్దరు మహిళల నేతృత్వంలోనే విజయవంతంగా జరిగిందన్నారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థాయిని అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం హేమలతను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయం సంస్థల కరస్పాండెంట్ శైలజ, విశ్రాంత లైబ్రేరియన్ లలిత, రచయత్రి అరుణకుమారి, డిప్యూటీ లైబ్రేరియన్ గజేంద్రబాబు, లైబ్రేరియన్లు బిలాల్, పూర్ణిమ, దేవిబాల, సుల్తానా భాను. తులసీరామ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


థామస్‌ను కలిసిన యువత నాయకుడు


థామస్‌కు శాలువ కప్పి సత్కరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

వెదురుకుప్పం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్‌ను బుధవారం మండల తెలుగు యువత నాయకుడు బండి విష్ణువర్ధన్‌రెడ్డి కలిశారు. శాలువా కప్పి సత్కరించారు. మండలాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యేని అభినందించారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

● అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ మెగా చెక్ విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యేలు




అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మెగా చెక్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు మురళీ మోహన్ - గాలి భానుప్రకాష్

యాదమరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా రైతలకు చేయూతనిచ్చి కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండో విడత నిధులు విడుదల సందర్భంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రూ.22.65 కోట్ల చెక్కును ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం కష్టకాలంలో రైతులకు అండగా నిలుస్తోందన్నారు. వివిధ కారణాలతో పథకం కింద సాయం నగదు జమకాని 600 మంది రైతుల సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారధి, ఎంపీడీవో వీరేంద్ర, ఏవో దీప, యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల మండలాల పార్టీ అధ్యక్షులు మురార్జీ యాదవ్, ఎస్‌పీ ధరణి, గంగారపు హరిబాబు నాయుడు,నాయకులు మణి నాయుడు తదితరులు పాల్గొన్నారు. **పుత్తూరు టౌన్** : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కులను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేర యూరియా విడతల వారీగా అందిస్తామన్నారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, ఏఎంసీ చైర్మన్ డి.ఎస్.గణేష్, మాజీ ఎంపీపీ ఎలుమలై, జడ్పిటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, జీవరత్నం నాయుడు, బాలాజీ, కరుణాయాదవ్, అధికారులు పాల్గొన్నారు. **గంగాధరనెల్లూరు:** స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌పథకం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వవిప్ డాక్టర్ వి.ఎం.థామస్,కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 66,218 మంది రైతులకు రూ.24.06 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. అక్కనగారిపల్లెలో ఇల్లు కోల్పోయిన మహిళకు వారు రూ.50వేల చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, ముప్పిరి మోహన్‌నాయుడు, స్వామిదాస్, చెంగల్రాయయాదవ్, మోహన్ మురళి, అరుల్‌నాదన్, అరుణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం అందిస్తున్న ఈవో పెంచల కిషోర్

ఐరాల(కాణి పాకం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాణిపాకాన్ని చెత్త రహిత క్షేత్రం చేద్దామని ఈవో పెంచలకిషోర్ అన్నారు. ఆస్థాన మండపంలో బుధవారం ఆయన 190 మంది పద్మావతి ఏజెన్సీ కార్మికులకు ప్రోత్సాహకంగా యూనిఫాం, స్వీట్ బాక్సులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి సామాన్య భక్తులతో పాటు అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందు వలన ఆలయ పరిసరాలలో పారిశుధ్య లోపం లేకుండా చూలన్నారు. ఎక్కడ కానీ చెత్త కనబడకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ధనంజయ, ఎస్వీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ పరిశీలన


శాస్త్రవేత్తతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి వీలుగా కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్‌లు మైసూర్‌లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజింగ్ పెసిలిటీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. అక్కడ సీనియర్ శాస్త్రవేత వినోద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్లాస్టిక్ రీసైకిల్ మేనేజ్‌మెంట్ ప్రొడక్ట్ బ్లాక్ తయారీ అంశాలను పరిశీలించారు. ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెస్ తీరును పరిశీలించి అధికారులతో చర్చించారు. చిత్తూరులోనూ దీనిని సమర్థవంతంగా నిర్వహించడానికి సీనియర్ శాస్త్రవేత్త వినోద్ అధికారులతో చర్చించారు.

హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు సత్కారం



యాదమరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో బుధవారం అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కమ్ ప్రిన్సిపాల్ లలిత ఆధ్వర్యంలో 17 మంది పురుష టీచర్లకు మహిళా టీచర్లు దుస్తులు, బహుమతులు, స్వీట్లు అందించి సత్కరించారు. ఇలాంటి కార్యక్రమాలతో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని ఇన్-చార్జి భాస్కరరెడ్డి, కనకాచారి పేర్కొన్నారు.

సమష్టిగా సహకార సంఘం అభివృద్ధికి కృషి


సహకార సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాన్ని సమష్టి కృషితో అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ పిలుపునిచ్చారు. సహకార వారోత్సవాలను పురస్కరించుకుని సంఘం ఆవరణలో బుధవారం ఆయన సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. రైతుల సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. సంఘం చైర్‌పర్సన్ చిత్రనాయుడు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. మండల టీడీపీ అధ్యక్షులు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, పాలకవర్గ సభ్యులు మహబూబ్ బాషా, ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


లోకేష్‌రెడ్డితో ఎమ్మెల్యే జగన్మోహన్

పూతలపట్టు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనేత, ఎల్బీఐ మేనేజింగ్ డైరక్టర్ ముత్తిరేవుల లోకేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభయసాయి ట్రస్టు ద్వారా మురకంబట్టులో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు జగన్మోహన్,మురళీమోహన్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, కాజూరు బాలాజిలు ప్రారంభించారు. ట్రస్టు వ్యవస్థాపకులు రామమూర్తిరెడ్డి, రేణుక, నాయకులు గంగారపు గోపి, దొరబాబు చౌదరి, రెడ్డెప్పరెడ్డి, కార్పొరేటర్ నవీన్ కుమార్, రంజిత్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, హరి, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కళానివేదన


ఈవో పెంచల కిషోర్‌తో కళాకారులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని ఆస్థాన మండపంలో కళాకారులు బుధవారం రాత్రి కళానివేదన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. చెన్నైకి చెందిన భారత్ కళాఆర్ట్సుకు చెందిన కళాకారులు కూచిపూడి,భరతనాట్యం ప్రదర్శించారు. ఆహుతులను ఆకట్టుకున్నారు. కళాకారులకు .ఈవో పెంచలకిషోర్ ప్రసంశా పత్రాన్ని, మెమెంటోను అందించారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 86మంది ఎంపిక


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి

వెదురుకుప్పం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జేకేసీ సహకారంతో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. సుమారు 172 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 86 మందికి ఉద్యోగ అవకాశాలు పొందినట్లు డాక్టర్ సీతా విజయులురెడ్డి తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.గుణశేఖర్‌రెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఆనంద్, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ సి.ఎన్ లత పాల్గొన్నారు.

నేడు అధికారులతో సమీక్ష

గుడిపాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ కార్యాలయంలో గురువారం ఉదయం అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శిరీష తెలిపారు. అధికారులు నివేదికలతో హాజరు కావాలన్నారు.

ఇందిరాగాంధీకి నివాళులు


ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సెల్వం

గుడిపాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు సెల్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో ఆమె చేసిన సేవలు ధైర్య సాహసాలు మరువలేమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. **నగరి:** పట్టణ పరిధిలోని టవర్‌క్లాక్ వద్ద మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ అల్లాఫిష్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన మొదటి మహిళా ప్రధానిగా బ్యాంకులను జాతీయ చేసిన ఘనతను సాధించారని ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబు, నటరాజ్ మొదలియార్, చిరంజీవి రెడ్డి, నాగేశ్వరరావు, దేశయ్య పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ


సంతకాల సేకరణ కార్యక్రమంలో సునీల్ తదితరులు

యాదమరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వైసీపీ మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన, లలితా థామస్, జడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వ్యవసాయ మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తాం


సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. బుధవారం స్థానిక కట్టమంచి వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీ ఎంకటేష్ యాదవ్ అధ్యతన చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నగరంలోని కట్టమంచి, మంగసముద్రం, కట్టమంచి మార్కెట్ యార్డులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనురాధ, డైరెక్టర్లు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,చుడా చైర్ పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.